పులివెందులలో ప్రజలకు అభివాదం చేస్తున్న మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ఏనుగుల బీభత్సం

సంఘటనా స్థలంలో గుమ్మిగూడిన ప్రజలు

మృతి చెందిన చెంగల్‌రాయుడు



ముగ్గురు భక్తులు మృతి

- ఇద్దరికి తీవ్ర గాయాలు..పరిస్థితి విషమం
- సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రులు, జగన్ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం
- గాయపడిన వారికి రూ.5 లక్షలు
- 'ముక్కా' ఫౌండేషన్ రూ.లక్ష సాయం
- బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే శ్రీధర్ పరామర్శ

మృతి చెందిన దినేష్

మృతిచెందిన మునెమ్మ

ఏనుగుల దాడిలో గాయపడిన అమ్ములు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు(అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లాలో ఏనుగులు బీభత్సం సృష్టించాయి. రైల్వేకోడూరు నియోజకవర్గం ఓబులవారిపల్లె మండల పరిధిలోని గుండాలకోన వద్ద భక్తులపై దాడి చేశాయి. ఈ ఘటనలో అక్కడికక్కడే ముగ్గురు భక్తులు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉంది. శివరాత్రిని పురష్కరించుకుని మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి నడుచుకుంటూ వెళుతుండగా వారిపై ఏనుగులు దాడి చేశాయి. ఏనుగుల మంద దాడి చేయడంతో ఉర్లగట్టుపోడు దళితవాడకు చెందిన వంకాయల దినేష్ (35), కె.బుడుగుంటపల్లె పంచాయతీ కన్నగుంట ఎస్‌టి కాలనీకి చెందిన తుపాకుల మణెమ్మ (30), తిరుపతి చంగల్ రాయుడు(30)గా పోలీసులు, అటవీశాఖ అధికారులు గుర్తించారు. ఉర్లగట్టుపోడు దళితవాడకు చెందిన పలిగెల సిద్దయ్య కుమారుడు పలిగెల రాజశేఖర్, సి.అమ్ములు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. బుధవారం శివరాత్రి పండుగను పురస్కరించుకొని భక్తులు అధిక సంఖ్యలో శైవ క్షేత్రాలకు వెళుతుంటారు. ఓబులవారిపల్లి మండలం వై.కోట సమీపంలోని గుండాలకోనకు భక్తులు రెండు రోజుల ముందు నుంచి వెళుతుంటారు. ఆ సమయంలోనే సోమవారం అర్ధరాత్రి రెండు, మూడు గంటల సమయంలో అటవీ ప్రాంతంలో వెళుతున్న భక్తులపై ఏనుగులు దాడి చేశాయి. రైల్వేకోడూరు సిఐ వెంకటేశ్వర్లు, ఓబులవారిపల్లె ఎస్ఐ పి.మహేష్ మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం వారి బంధువులకు అప్పగించారు. అదనపు ఎస్‌పి (అడ్మిన్) వెంకటాద్రి, సిసిఎఫ్ సెల్వం, డిఎఫ్‌ఒ జగన్నాథ్ సింగ్, సబ్ డిఎఫ్‌ఒ సుబ్బురాజు, ఎఫ్ఆర్‌ఒ పిఎ శ్యాంసుందర్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కాగా వేసవి కాలంలో ఏనుగుల మంద తాగునీటి కోసం అటవీ సమీప గ్రామాలలోని మామిడి తోటలలో దాడులు చేసి కాపు కొచ్చిన మామిడి చెట్లను, పైపులను, మోటార్లను ధ్వంసం చేస్తుంటాయి. ప్రతి సారీ ప్రభుత్వం నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తుంటుంది.

సిఎం, డిప్యూటీ సిఎం, మంత్రుల దిగ్భ్రాంతి

ఏనుగుల దాడిలో ముగ్గురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం, మరో ఇద్దరు తీవ్రంగా గాయపడటంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, అన్నమయ్య జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డి, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని వారు ప్రకటించారు. జరిగిన ఘటనపై సిఎం, డిప్యూటీ సిఎం అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

భక్తుల మృతి బాధాకరం : జగన్

ఏనుగుల దాడిలో భక్తులు మృతి చెందిన ఘటనపై వైసిపి అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భక్తుల మృతి అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలను కూటమి ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు. గాయపడ్డ వారికి మెరుగైన వైద్యం అందించాలన్నారు. రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మృతు కుటుంబాలకు తన సంతాపాన్ని వ్యక్తం చేశారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం

ఏనుగుల దాడి ఘటనపై డిప్యూటీ సిఎం, అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ తక్షణం స్పందించారు. ముగ్గురు చనిపోవడం బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. సంఘటనపై సమగ్ర విచారణ చేపట్టాలని అటవీ శాఖ అధికారులను పవన్ కల్యాణ్ ఆదేశించారు. బాధిత కుటుంబాలను పరామర్శించాలని రైల్వేకోడూరు ఎమ్మెల్యే అవర శ్రీధర్‌ను వై.కోటకు వెళ్లాలని పవన్ ఆదేశించారు. అసెంబ్లీ నుంచి శ్రీధర్ రైల్వేకోడూరుకు వచ్చి బాధితులను పరామర్శించారు.



మృతుల కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్

'ముక్కా' ఫౌండేషన్ ఆర్థిక సాయం

ఏనుగుల దాడిలో మృతి చెందిన కుటుంబాలను ఆదుకుంటామని కుడా చైర్మన్, ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి అన్నారు. మృతులకు ఒక్కొక్కరికి రూ.లక్ష, గాయపడిన వారికి రూ.25 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఎమ్మెల్యే అవర శ్రీధర్, ముక్కా వరలక్ష్మి బాధితుల ఇళ్లకు వెళ్లి చెక్‌లను అందజేశారు. అంత్యక్రియలకు ఒక్కొక్క కుటుంబానికి రూ.20 చొప్పున అందజేశారు.

అనుమతి లేకుండా అడవిలోకి వెళ్లొద్దు : డిఎఫ్‌ఒ

ఏనుగుల దాడి ఘటనపై రాజంపేట డిఎఫ్ఒ జగన్నాథ్‌సింగ్ విలేకరులతో మాట్లాడుతూ వేసవి కాలం వస్తున్నందున అటవీ ప్రాంతంలో తాగునీరు లేకపోవడంతో వన్యప్రాణులు అటవీ సమీప గ్రామాలలోకి ప్రవేశిస్తాయని తెలిపారు. ఏనుగుల మంద గుండాలకోన సమీపంలో సంచరిస్తున్న సమయంలో అటవీ శాఖ అనుమతి లేకుండా కొంతమంది గుండాలకోనకు అంటూ వెళ్లారని చెప్పారు. ఆ సమయంలో ఆహారం లేక కోపంలో ఉన్న ఏనుగుల మందకు రాత్రి సమయంలో మనుషులు కనపడడంతో వారిపై దాడి చేసి ఉంటాయని పేర్కొన్నారు. దాదాపు 15 ఏనుగుల మంద అటవీ ప్రాంతంలో తిరుగుతున్నాయని చెప్పారు. ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమతి లేకుండా ఎవరు అటవీ ప్రాంతాల్లోకి వెళ్ళకూడదని తెలిపారు.

మృతుల కుటుంబాలకు నాయకుల పరామర్శ

ఏనుగుల దాడిలో మృతి చెందిన వారి మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి సతీమణి వరలక్ష్మి, టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహం ప్రసాద్, తాతంశెట్టి నాగేంద్ర, టి.వి.రమణారెడ్డి, మైసూరువారిపల్లె సర్పంచ్ సంయుక్త, తదితరులు మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలం : సిపిఎం

రాయచోటి టౌన్ : గుండాలకోనకు వెళ్లే యాత్రికులపై ఏనుగుల మంద దాడి చేయడంతో ముగ్గురు మృతి చెందడం బాధాకరమని సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు ఒక ప్రకటనలో దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. భక్తులకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, గాయపడిన వారికి రూ.10 లక్షల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. భక్తుల మరణానికి కారకులైన అటవీ అధికారులను సస్పెండ్ చేయాలన్నారు.

వివరాలను అడిగి తెలుసుకుంటున్న ముక్కా వరలక్ష్మి

సమస్యలపై పోరాటం చేద్దాం

ప్రతి కార్యకర్తకూ అండగా ఉంటా
ప్రజాదర్బార్‌లో మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మంచి రోజులు వస్తాయని ఎవరు అధైర్య పడకుండా ఉండాలని, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని, ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లి నుంచి మధ్యాహ్నం 12 గంటలకు పులివెందులకు హెలిక్యాప్టర్‌లో చేరుకున్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఇటీవల వైసిపి కార్యవర్గంలో పదవులు పొందిన వారు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున వచ్చారు. ఈ సందర్భంగా వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి నుంచి విజ్ఞప్తులను స్వీకరించి మీ సమస్యలను పరిష్కరించే విధంగా చూస్తామని, ప్రభుత్వం వినకపోతే పోరాటాలు చేసే దానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు తెలుసుకున్నారు. ఏ కార్యకర్తకు అన్యాయం జరిగిన నేనున్నానని వారికి భరోసా ఇచ్చారు. కూటమి నాయకులు దాడులకు ఎవరు భయపడకూడదని ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాడాలని వారికి సూచించారు. నియోజక వర్గంలోని తాండాలలో నిర్వహిస్తున్న సుగాలి మహిళలు జగన్ కలిసి అనంతరం హోలీ సంబరాలలో భాగంగా కోలా టాలు చేశారు. పులివెందులకు వచ్చిన జగన్‌కు పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికారు. భాకరాపురంలోని హెలిప్యాడ్ దగ్గర మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా, కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, కడప నగర మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యేలు దాసరి సుధా, అమర్నాథ్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, అభిమానులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు.

జిల్లా రాజకీయాలపై ఆరా : నెలరోజులుగా జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాల గురించి వైసిపి నాయకులతో జగన్ ఆరా తీశారు. నియోజకవర్గాల వారీగా కూటమి ప్రభుత్వం చేస్తున్న దౌర్జన్యాల గురించి నాయకులు జగన్ దృష్టికి తీసుకువెళ్లినట్టు తెలుస్తుంది. అవసరమైతే పోరాటం చేద్దామని, కొన్ని విషయాలపై న్యాయ స్థానాలను ఆశ్రయిస్తామని నాయకులకు జగన్ చెప్పినట్టు తెలుస్తుంది. వైసిపి ఎంపిటిసి, జడ్‌పిటిసి, కౌన్సిలర్లను కూటమి నాయకులు భయపెట్టి పార్టీలో చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారని నాయకులు జగన్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎవరు భయపడాల్సిన అవసరం లేదని ప్రతి ఒక్కరికీ అండగా ఉంటామని తెలిపారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : డిఇఒ

మాట్లాడుతున్న డిఇఒ సుబ్రహ్మణ్యం

ప్రజాశక్తి - రాయచోటి

మార్చిలో నిర్వహించబోయే పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించటంతో పాటు బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం అన్నారు. మంగళవారం సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పాఠశాల వార్షికోత్సవ, పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు పదవ తరగతి పునాది వంటిదన్నారు. లక్ష సాధన కోసం పట్టుదల, అంకితభావంతో బాగా చదవాలన్నారు. పరీక్షలలో చూచి రాతలు ఉండవని, అత్యంత పకడ్బందీగా పరీక్షలను నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకర్షించాయి. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'పలవలి' బాటలో పయనిద్దాం : సిపిఎం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సిపిఎం సీనియర్ నేత పలవలి రామకృష్ణారెడ్డి బాటలో పయనిద్దామని, అదే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో రామకృష్ణారెడ్డి నాల్గవ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో పుట్టిన రామకృష్ణారెడ్డి బాగా చదువుకుని న్యాయవాది వృత్తిలో చేరి ఎందరో పేదలకు పైసా ఫీజు తీసుకోకుండా సేవలందించారని కొనియాడారు. భూస్వామి కుటుంబంతో సంబంధం కలుపుకున్నా, గొప్పగా బతికేందుకు అవకాశాలున్నా, సిపిఎం బాటను వీడలేదన్నారు. మదనపల్లి స్పిన్నింగ్ మిల్లు, మండపల్లి మోటార్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేయడంలో పలవలి కీలకపాత్ర పోషించాడని వివరించారు. నిరంతరం మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా ప్రచారం చేశారని, కమ్యూనిస్టు రాజ్యం ఏర్పాటు చేయడం ద్వారానే పేదల కష్టాలు తీరుతాయాని అందుకు పోరాటమే సరైన మార్గమని నమ్మి ఆచరించారని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో పయనిస్తూ, కష్టజీవులను ఐక్యం చేసి సమసమాజ స్థాపనకు కృషి చేయడమే ఆయనకు ఘనమైన నివాళి అన్నారు. సిపిఎం నాయకులు హరిశర్మ మాట్లాడుతూ కడవరకు పేదల అభివృద్ధి కోసం కృషి చేసాడన్నారు. విలాసవంతమైన జీవితం గడపడానికి అవకాశాలు ఉన్నా కూడా నిరాడంబరంగా జీవించడన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నరసింహ, రఘునాథ్, నాగరాజు, సిఐటియు నాయకులు నారాయణ, రమణ, కృష్ణమూర్తి, విద్యార్థి నాయకులు జయబాబు, ఆఫ్రిద్ పాల్గొన్నారు.

పలవలి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

క్యాట్‌లో 'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రభంజనం

ప్రజాశక్తి - రాయచోటి

స్థానిక కడప రోడ్డులోని శ్రీ చైతన్య ఇంటర్నేషనల్ బోర్డింగ్ స్కూల్ (సిబిఎస్‌సి) విద్యార్థులు క్యాట్ ఒలంపియాడ్ వెలువరించిన లెవల్ - 2 ఫలితాల్లో 15 మంది నగదు పురస్కారాలు, 62 మంది మెడల్స్, 152 మంది మెరీట్ సర్టి ఫికెట్‌లు సాధించారు. ఇంతటి విశేష ఫలితాలను సాధించినందుకు కడప డివిజన్ ఎజిఎమ్ డి. రమణయ్య విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ సంచాలకులు పి.మహబూబ్ బాష మాట్లాడుతూ దేశవ్యాప్తంగా క్యాట్ ఒలంపియాడ్ సంస్థ గత ఏడాది డిసెంబర్ 8న హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ పరీక్షల్లో అద్భుత ప్రతిభ కనబరిచి బహుమతులను కైవసం చేసుకోవడం అభినందనీయమని అన్నారు. విజేతలకు వారి తల్లిదండ్రుల చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. శ్రీ చైతన్య మేనేజ్‌మెంట్ పొందుపరచిన అకాడమిక్ ప్లాన్‌తోబాటు ప్రతి విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ చూపడంవల్ల పోటీపరీక్ష ఏదైనప్పటికీ ఉత్తమ ఫలితాలను తమ విద్యార్థులే సొంతం చేసుకోగలుగుతున్నారని వారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కళాభారతి కో-ఆర్డినేటర్ కుటుంబరావు, వైస్ ప్రిన్సిపల్ జీవానందం, డీన్ శివప్రసాద్, ఇన్‌ఛార్జి నరసింహులు, రెడ్డి ప్రసాద్ పాల్గొన్నారు.

'వైసిపి విధానాలతో దిగజారిన ఆర్థిక పరిస్థితి'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గత ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం, మాజీ సిఎం జగన్ అవలంభించిన విధానాలతో రాష్ట్రం ఆర్థికంగా దివాలా తీసిందని అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే షాజహాన్ బాషా పేర్కొన్నారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో బటన్ నొక్కిన జగన్ రాష్ట్ర ప్రగతికి ఆటంకం కలిగించారన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రంలో పరిస్థితులు చక్కబడుతున్నాయన్నారు. గత ప్రభుత్వ పాలనలో ల్యాండ్, శాండ్ వైన్, మైన్ మాఫియాలపై విమర్శలు గుప్పించారు. అనేక పాఠశాలలు మూత పడ్డాయని, ఫీజు రీయింబర్స్మెంట్ తల్లుల ఖాతాలకు మళ్లించి నాణ్యమైన విద్యను దూరం చేశారని ఆరోపించారు. జగనన్న భూ సర్వేలో ప్రజల్లో అభద్రత కల్పించారన్నారు. డికెటి భూములు పేదల వద్ద కొనుగోలు చేసి పెద్దఎత్తున సొమ్ము చేసుకున్నారన్నారు. ఫ్రీ హోల్డ్‌లో ఉన్న భూములను గుర్తించి అధికారాన్ని అడ్డంపెట్టుకోవడం ద్వారా భూ మాఫియాకు తెరతీశారని పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్లలో ప్రజల సమస్యలు పరిష్కారం దిశగా పని చేసిన దాఖలాలు లేవని, జగన్ పాలనంత నియంతలా సాగిందని అన్నారు. రాష్ట్ర పునఃనిర్మాణం కోసం సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేష్, మంత్రి మండలి సారథ్యంలో ప్రత్యేక కార్యాచరణతో ప్రగతి పథంలోకి తీసుకెళ్లడం జరుగుతోందని చెప్పారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి : సిఐటియు

మదనపల్లె : నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మున్సిపల్ పారిశుధ్య కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. కార్మికులకు భద్రత కల్పించాలని, పర్మనెంట్ చేయాలని, అప్పటి వరకూ ఆప్కాస్ లోనే కొనసాగించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ కార్పోరేట్లకు ఊడిగం చేసే సిఎం చంద్రబాబులాంటి వాళ్లు అన్ని సంస్థలను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ విధానంలోకి తీసుకొచ్చి దోపిడీకి ఊతం ఇచ్చారన్నారు. ఎన్నికల సమయంలో మాత్రం అవుట్‌సోర్సింగ్ విధానాలను రద్దుచేసి కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా చేస్తామని హామీలు గుప్పించే నాయకులు ఎన్నికల తర్వాత కార్పోరేట్లకు ఊడిగం చేయడమే తమ పనిగా పెట్టుకుంటున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి దాని స్థానంలో ఆప్కాస్ విధానం తీసుకురావడంతో కార్మికులకు కొంతమేర ఉపయోగ పడిందన్నారు. ఆ సమయంలో తమను ప్రభుత్వ ఉద్యోగులుగా చేస్తారని కార్మికులు ఆశ పడ్డారేకాని అది అమలుకు నోచుకోలేదని అన్నారు. ఇటీవల అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆప్కాస్ ను రద్దుచేసి తిరిగి కార్మికుల శ్రమను దోచుకోవడానికి అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో కార్మికులందరినీ చేర్చాలని ప్రయత్నించడం దుర్మార్గమని అన్నారు. ఈ పద్ధతిని కార్మికులందరూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, కార్మికులపై ప్రేమ, చిత్తశుద్ధి ఉంటే అందరిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కోశాధికారి హరీంద్రనాథ్ శర్మ మాట్లాడుతూ రోజు రోజూకు పట్టణం వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో కార్మికులపై పని భారం తీవ్రంగా పెరుగు తోందని, మరింత మంది కార్మికులను పారిశుధ్య విభాగంలో చేర్పించి పని భారాన్ని తగ్గించాలని కోరారు. కార్మికులకు సోపులు, యూనిఫామ్, చెప్పులు, ఆయిల్, బ్లౌజులు, మాస్కులు తదితర సామగ్రి ఇవ్వాల్సి ఉన్న ఇంతవరకు ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. కార్మికుల పొట్ట కొట్టాలని చూస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, కార్మికులందరిని ఐక్యం చేసి ఉద్యమబాట పడుతామని హెచ్చరించారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా కార్మికులను పర్మినెంట్ చేసి కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరారు. అలా కాకుండా కార్మికుల శ్రమను దోచుకోవాలని చూస్తే మాత్రం కార్మిక ఉద్యమాన్ని తీవ్రతరం చేసి ఈ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు కార్మికులు నడుం బిగించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు జి కృష్ణమూర్తి, కార్మిక సంఘ నాయకులు చలపతి నాయుడు, సాంబశివ నాయక్, రామకృష్ణ, రాజు, కృష్ణప్ప, శ్రీరాములు, గోపాల్, మునుస్వామి, చంద్ర, చిన్న రెడ్డెప్ప, నరసింహులు, శంకర్ నాయక్ పాల్గొన్నారు.

రాయచోటి టౌన్ : ఆప్కాస్ కొనసాగించాలంటూ స్థానిక ఎపి, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు 200 మంది స్వయంగా ఉత్తరాలు రాసి, పోస్ట్ చేస్తూ మున్సిపల్ కార్మికులు నిరసన తెలిపారు. మంగళవారం జగదాంబ సెంటర్ నుంచి పోస్ట్ తపాలా కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఆప్కాస్ రద్దుకు వ్యతిరేకంగా నిరసన చేపట్టారు. ఆప్కాస్ కొనసాగించేంతవరకు, కార్మికులను పర్మినెంట్ చేసే వరకు వివిధ రూపాలలో దశల వారి పోరాటాలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు బివి.రమణ, జిల్లా ఉపాధ్యక్షులు యం.చెన్నయ్య, వై.శంకరయ్య, అక్బర్, రమేష్, దేవా, తిరుపాల్ సురేష్, సిద్దిమల్లు, ఉమా మహేశ్వరీ, కేశమ్మ, రమేష్, ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

పోస్ట్ బాక్స్‌లో ఉత్తరాలు వేస్తున్న కార్మికులు

పేదలందరికీ గూడు కల్పిస్తాం : పీడీ

ప్రజాశక్తి - రాయచోటి: జిల్లాలో ఇల్లు లేని నిరుపేదలు ఎవరూ ఉండకూడదని, అర్హులైన పేదలందరికీ మంజూరు చేయడమే లక్ష్యంగా పిఎంఎవై 2.0 సర్వేను వేగంగా చేపట్టాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి జిల్లా అధికారి శివయ్య తెలిపారు. మంగళవారం ఉదయం నియోజకవర్గంలోని ఉప కార్య నిర్వహణ అధికారి, మండల సహాయక ఇంజినీర్లతో ,మండల కంప్యూటర్ ఆపరేటర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లతో స్థానిక హౌసింగ్ ఎఇ కార్యాలయంలో నియోజకవర్గంలో ఇళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా శివయ్య మాట్లాడుతూ జిల్లాలో ఇల్లు లేని పేదలు ఎవరూ ఉండకూడదని లక్ష్యంతో కేంద్ర- రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లను మంజూరు చేస్తున్నాయని చెప్పారు. ఈ గొప్ప అవకాశాన్ని నిరుపేదలందరూ వినియోగించుకునేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. పిఎంఎవై సర్వేలో ఇల్లు లేని నిరుపేదలందరిని కచ్చితంగా గుర్తించి వారికి మంజూరు చేయాలని సూచించారు. గతంలో ఇల్లు మంజూరై శిథిలావస్థకు చేరి, నివాసయోగ్యం కానీ ఇళ్లను కూడా గుర్తించి, ఆ వివరాలను స్థానిక శాసనసభ్యుల వారికి అందజేయాలని చెప్పారు. వారి ద్వారా ప్రభుత్వానికి తెలియజేసి వీరందరికీ కూడా నూతన ఇల్లు మంజూరయ్యేలా చర్యలు చేపడతామని తెలిపారు.

గిరిజనులకు చేయూత

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని బోయినపల్లి సెక్టార్ పెద్ద కారంపల్లి పంచాయతీలో గల చెంచ కాలనీలో సిడిపిఒ సుజామణి ఆధ్వర్యంలో ఆధార్, రేషన్ కార్డు వంటి కనీస గుర్తింపు కార్డులు లేని గిరిజనులను గుర్తించి మంగళవారం వారికి ఆధార్ కార్డులు నమోదు చేయించి బడిఈడు పిల్లలను బడిలో చేర్పించారు. గుర్తింపు కార్డులు సైతం లేకుండా వీధులలో తిరుగుతున్న ఆరుగురు పిల్లలను గుర్తించి వారికి ఆధార్ కార్డు నమోదు చేయించి బాలసదనంలో చేర్పించినట్లు సిడిపిఒ సుజామణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్తింపు కార్డులు లేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోని గిరిజనులను గుర్తించి వారికి చేయూతనిచ్చామన్నారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ పి.పార్వతీదేవి పాల్గొన్నారు.

విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఎంఇఒలు

పోటీతత్వంతోనే భవిష్యత్తులో ఉన్నత స్థానం

ప్రజాశక్తి-పుల్లంపేట

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎస్‌బివిడి పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభ పరీక్ష నిర్వహించారు. పరీక్ష అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మండల విద్యాధికారులు చక్రధర్‌రాజు, బి.నాగతిరుమలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పోటీ తత్వం లక్షణాన్ని తప్పకుండా కలిగి ఉండాలన్నారు. పోటీ తత్వం ఉంటేనే భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకో వచ్చని అన్నారు. మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఆదర్శ పాఠశాల విద్యార్థిని ఎస్. సాలేహపర్వీన్ కు రూ.5వేలు నగదును గుడారు సీతమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు జి.సుబ్బరాయుడునాయుడు చేతుల మీదుగా అందించారు. కార్యక్రమంలో ఎస్‌బివిడి పాఠశాల కరస్పాం డెంట్ శ్రీరాములు, హెచ్ఎం మురళిరెడ్డి, ఎస్‌టియు జిల్లా అసోసియేట్ అధ్య క్షుడు బి.నరేంద్రనాథ్, ఎస్‌టియు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సయ్య ద్ సర్తాజ్‌హుస్సేన్, వి.సిద్దయ్య ఉపాధ్యాయులు రాజయ్య పాల్గొన్నారు.

నగర పంచాయతీ ఆర్‌ఐగా రెడ్డిమస్తాన్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

తంబళ్లపల్లె నియోజకవర్గం,బి.కొత్తకోట నగర పంచాయతీ ఆర్‌ఐగా రెడ్డి మస్తాన్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ విధులు నిర్వహిస్తున్న భార్గవి పలమనేరుకు బదిలీపై వెళ్లడంతో ఆమె స్థానంలో పుంగునూరు మునిసిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న రెడ్డి మస్తాన్ బి.కొత్తకోట నగర పంచాయతీగా వచ్చారు.ఈ సందర్భంగా రెడ్డి మస్తాన్ మాట్లాడుతూ బి.కొత్తకోట నగర పంచాయతీ ఆర్.ఐగా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని,కమిషనర్ జీవి పల్లవి,సిబ్బంది సహకారంతో పంచాయతీ అభివృద్ధికి బాటలు వేస్తానన్నారు.ఆర్.ఐగా బాధ్యతలు చేపట్టిన రెడ్డి మస్తానుకు నగర పంచాయతీ,అధికారులు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.ఫోటో రైట్ అప్:

గుండాలకోనకు రాకపోకలు నిలిపివేత

ప్రజాశక్తి- పుల్లంపేట

ఓబులవారిపల్లి మండల పరిధిలోని వైకోట గ్రామం రిజర్వ్ ఫారెస్ట్‌లో గల గుండాలకోనలో దారితప్పిన ఏనుగుల సమూహం వలన ప్రజలకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున కలెక్టర్, డిఎఫ్ఒ ఆదేశాల మేరకు రాకపోకలు తాత్కాలికంగా నిలిపివేసినట్లు తహశీల్దార్, ఎంపిడిఒ మల్‌రెడ్డిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమ వారం అర్ధరాత్రి సమయంలో ఏనుగుల సమూహం గుండాల కోన సమీపంలో భక్తులపై దాడి చేశాయని, ఈ దాడిలోముగ్గురు మృతి చెందినట్లు తెలిపారు. ప్రజలు అర్థం చేసుకొని సహకరించాలని కోరారు.

మయూర వాహనంపై భోళా శంకరుడు

ప్రజాశక్తి- కలకడ

మయూర వాహనంపై విహరిస్తున్న పార్వతి పరమేశ్వరులు

మయూర వాహనంపై పార్వతి పరమేశ్వరులు విహరించారు. మండలంలోని దేవాలయం పేట వెలిసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి బాలిజ కులస్తులకు కేటాయిం చిన మయూర వాహనంపై శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి పురవీధుల్లో విహరించినట్లు ఆలయ ధర్మకర్త రవీంద్రస్వామి తెలిపారు. రంగురంగుల విద్యుత్ దీపాలతో ప్రత్యేకమైన పూలతో అలంకరించిన మయూర వాహనంపై దేవళంపేట ఎర్రగాలపల్లి కలకడ పురవీధులలో కోలాటాలు, బళ్లారి డ్రమ్ములు మధ్య విహరించినట్లు తెలిపారు.

ఊరేగింపునకు సిద్ధమైన తేరు

శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి వారి ఊరేగింపుకు పేరు సిద్ధమైనట్లు ఆలయ ధర్మకర్త రవీంద్ర స్వామి తెలిపారు. మండల కేంద్రమైన కలకడ దేవళంపేటలో వెలిసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో గతంలో ఉన్న తేరు శిథిలావస్తులు చేరడంతో వేరేతెరను నూతనంగా తయారు చేయించినట్లు తెలిపారు. ండలంలో ఇతర దేశాల్లో ఇతర దేశాలలో ఉన్న పలువురు యువకులు చందాల రూపంలో వేసుకుని తేరును తయారు చేయాలన్న సంకల్పంతో ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ తేరు తయారీకి మండలంలో చాలామంది యువకులు విదేశాల్లో ఉన్న వారంతా సుమారు కోటి రూపాయలు విరాళం అందించారు. తేరును ఉంచడానికి షెడ్డును కూడా తయారు చేయడం జరుగుతుందని తెలిపారు.

వెండి కిరీటాలు బహూకరణ

వెండి కిరీటాలను అందిస్తున్న శేఖర్, కుటుంబసభ్యులు

వెండి కిరీటాలను మీసేవ శేఖర్ స్వామివారికి బహుకరించినట్లు ఆలయ ధర్మకర్త రవీందర్‌శర్మ కమిటీ సభ్యులు తెలిపారు. మండలంలోని దేవళం పేటలో వెలసిన శ్రీ కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయానికి వెండి కిరీటాలు రెండిం టిని బహుమతిగా ఇచ్చినట్లు తెలిపారు. కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకుని వెండి కిరీటాలను అందించారని తెలిపారు.

ప్రతిభ చాటిన 'జ్ఞానాంబిక' విద్యార్థులు

ప్రతిభ చాటిన విద్యార్థులతో అధ్యాపకులు

ప్రజాశక్తి-మదనపల్లె

ఇటీవల మిట్స్ కాలేజ్ నిర్వహించిన అశ్వవ్2కె25 ఆటల పోటీలో రాష్ట్ర స్థాయిలో కళాశాలలు అన్ని పాల్గొన్నారు. జ్ఞానంబికా డిగ్రీ కళాశాల విద్యార్థులు హ్యాండ్ బాల్ స్త్రీలు ఫైనల్స్‌లో మోహన్ బాబు యూనివ ర్సిటీతో 10 -17 పాయింట్స్ తేడాతో విజేతలుగా నిలిచి ప్రతిభ కనబరచారని కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. కె. అమృత గోల్డ్ మెడల్, డిస్కస్‌త్రో స్రీలు కె.రుక్మిణి గోల్డ్‌మెడల్, క్రికెట్ పురుషులు రన్నర్స్‌గా నిలిచారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ విద్యార్థులు చదువులోనే కాకుండా ఆటల్లోనూ, సామజిక కార్యక్రమాలలో కూడా చాలా చురుకుగా పాల్గొం టున్నారని విద్యార్థులను అభినంది ంచారు. ప్రిన్సి పల్ ఎస్.రమాదేవి మాట్లాడుతూ కళాశాల ఫీజికల్ డైరెక్టర్స్ శరత్ కుమార్, జగదీశ్ కృషి అని చెప్పారు.

మహారాజశ్రీ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో, పీలేరు

O.S.No. 78 of 2017

బంధం మదన మోహన్. ...వాది

Vs

గుండ్లూరి యల్లమ్మ (died) మరియు ఇతరులు.

...ప్రతివాదులు

3వ ప్రతివాదికి దావా సమను

శ్రీ G. నరేష్ బాబు, S/o నాగయ్య, నివాసము: D.No.2. 257/1, G.V. నగర్, పీలేరు టౌన్, పోస్ట్ & మండలం, అన్నమయ్య జిల్లా.

పై వారి దాఖలు చేసిన పై దావా లోని మీ హాజరు నిమిత్తమై 18-03-2025 వ తేదీన వాయిదావేసి ఉన్నారు. కావున మీరు నేరుగా కాని లేదా న్యాయవాది ద్వారా కాని కోర్టులో 18-03-2025వ తేదీన ఉదయం 10.30 గంటలకు హాజరై మీ వాదనలను తెలుపుకొనవలెను, లేని యడల మీ పరోక్షమున తీర్పు ఇవ్వబడునని తెలియచేయడమైనది.

//By Order of Court//

ఎమ్. భవానీ శంకర,

న్యాయవాది, పీలేరు.

క్షయ వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు

ప్రజాశక్తి-దనపల్లె అర్బన్

నిమ్మనపల్లి : తవళంలో టిబిపై సమీక్షిస్తున్న డాక్టర్ రమేష్ బాబు

టిబి రహిత దేశమే దేశ, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని మదనపల్లి డివిజన్ టిబి. నోడల్ అధికారి డాక్టర్ రమేష్ బాబు తెలిపారు. మదనపల్లి టిబి. యూనిట్ పరిధిలో ఐదు పంచాయతీలు మరియు వాయల్పాడు టిబి యూనిట్ పరిధిలో ఆరు పంచాయతీలు టిబి ముక్తి పంచాయతీలుగా గుర్తించినటుట్ల వెల్లడించారు. మంగళవారం మదనపల్లి పట్టణం త్యాగరాజ వీధిలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంబంధించిన పంచాయతీల ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్ఎంలు, టిబి నోడల్ అధికారులు, టిబి.ట్రీట్మెంట్ పర్యవేక్షణ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. డాక్టర్ రమేష్ బాబు టిబి యూనిట్ వైద్యులు డాక్టర్ శ్రీధర్ డాక్టర్ పురఖాన్‌తో కలసి రికార్డులు పరిశీలించారు. అనంతరం నిమ్మనపల్లి మండలంలోని కొండయ్యగారిపల్లి, తవళం గ్రామాల్లో పర్యటించి గత ఆరు నెలలుగస టిబి మందులు తింటున్న వారిని కలసి వారి అభిప్రాయం తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు ప్రభాకర్, నాగిరెడ్డి, దేవేంద్ర, భూపతి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **నిమ్మనపల్లి**: నిమ్మనపల్లి మండల పరిధిలోని కొండయ్యగారిపల్లె, తవళం గ్రామాలలో క్షేత్రస్థాయిలో పర్యటించి టిబి మందులు తీసుకుంటున్న వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నట్లు డాక్టర్ రమేష్‌బాబు తెలిపారు. మదనపల్లి టి.బి.యూనిట్ పరిధిలో ఐదు పంచాయతీలు, వాల్మీకిపురం టి.బి.యూనిట్ పరిధిలో ఆరు పంచాయతీలు టి.బి. ముక్తి పంచాయతీలుగా గుర్తించినట్లు తెలిపారు.కార్యక్రమంలో ఆరోగ్య విద్యాధికారి మహమ్మద్ రఫీ, టిబి పర్యవేక్షకులు ప్రభాకర్, నాగిరెడ్డి, దేవేంద్ర, భూపతి, ఎమ్.ఎల్.హెచ్.పి లు, ఎఎన్ఎంలు, టిబి నోడల్ అధికారులు, టిబి ట్రీట్మెంట్ పర్యవేక్షణ సిబ్బందితో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యకు పటిష్ట పునాది : సిడిపిఒ

మాట్లాడుతున్న సిడిపిఒ సుజాత

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

అంగన్వాడీ కార్యకర్తల శిక్షణకై అమలు చేస్తున్న జ్ఞానజ్యోతి కార్యక్రమం పూర్వ ప్రాథమిక విద్యకు పట్టిష్ట పునాదులు వేస్తుందని సిడిపిఒ సుజాత అన్నారు. మంగళవారం మండలంలోని రెడ్డివారిపల్లెలో జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశానికి ఎంఇఒ ఎంఆర్ పద్మావతితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో ఆరు రోజులపాటు 120రోజుల సర్టిఫికెట్ కోర్సు జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమాన్ని రెండు విడతలుగా నిర్వహిం చినట్లు తెలిపారు. పూర్వ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకునేలా అంగన్వాడీలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. శిక్షణాకాలంలో నేర్చుకున్న అంశాలను అంగన్వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లో పూర్తిస్థాయిలో అమలు పరచాలన్నారు. 3 నుంచి 6 ఏళ్ల మధ్య ఉన్న పిల్లలలో శారీరక, మానసిక, సామాజిక, భాషాభివృద్ధి చెందడానికి, పిల్లలలో సృజనాత్మకతను పెంపొందించడానికి శిక్షణ కార్యక్రమం ఎంతగానో దోహదం చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు నరసింహులు, నిర్మల, అంగన్వాడీ సూపర్‌వైజర్ భాను లక్ష్మీదేవి పాల్గొన్నారు. **కలికిరి:** మండలంలో అంగన్వాడీ కార్యకర్తలకు గత వారం రోజులుగా జరుగుతున్న సాల్ట్ శిక్షణా కార్యక్రమాలు ముగిశాయి. వాల్మీకిపురం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని కలికిరి మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు సాల్ట్ శిక్షణ కార్యక్రమంలో ఆరవ రోజు చివర రోజు ఎస్ఆర్ఎం మేళా నిర్వహించడమైనది. ఈ కార్యక్రమంలో ఆరవ రోజు అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన పిల్లలో శారీరక అభివృద్ధి, పూర్వ ప్రాథమిక అభివృద్ధి, సామాజిక భావోద్వేగ అభివృద్ధి, మూల్యాంకనం సాల్ట్ ద్వారా అందరికీ వివరించారు. ఈ మేళాకు సిపిడిఒ భారతి, ఎంఇఒ కరీముల్లా ముఖ్య అతిథులుగా విచ్చేసి మేళాను ప్రారంభించారు. కార్యక్రమంలో డిఆర్‌పిఎస్ ముబారక్, అజంతుల్లా మల్లికార్జున్ రెడ్డి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ అరుంధతి, ఎస్ రెడ్డి సర్దార్ మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. **నందలూరు:** నాగిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత ఆరు రోజులుగా జ్ఞాన జ్యోతి 120 రోజుల సర్టిఫికెట్ కోర్స్ మండలంలోని మొత్తం అంగన్వాడీ వర్కర్లకు నిర్వహించారు. చివరి రోజు పాఠశాల సంసిద్ధత మేళాను ఎంఇఒ-1 నాగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు ట్రైనింగ్ లో నేర్చుకున్న అంశాలను అంగన్వాడీ కేంద్రంలో అమలు చేయాలన్నారు. ఎంఇఒ-2 అనంతకృష్ణ, హెచ్ఎం జయలలిత కుమారి మాట్లాడుతూ పిల్లల స్థాయికి తగినట్టు బోధన ఉండాలన్నారు. శిక్షణలో ఆర్‌పిలు ఆర్.కృపానందం, కె.ఆనంద్, సురేష్ కుమార్, స్వరూప, సూపర్‌వైజర్ సునీతమ్మ, సుబ్బలక్ష్మి దేవి, కో-ఆర్డినేటర్ లీలా కృష్ణ య్య పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు పూలకొండ ముస్తాబు

ఉత్సవాలకు సిద్ధమైన శ్రీభ్రరాంభిక ఆలయం

ప్రజాశక్తి-కలికిరి

మహాశివరాత్రి ఉత్సవాలకు గుట్టపాలెం గ్రామం కె.బర్నేపల్లిలోని పూలకొండ ముస్తాబు అయింది. మండలం లోని గుట్టపాలెం పంచాయతీ, కె.బర్నేపల్లి పూలకొండలో వెలసిన శ్రీ భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయం మహాశి వరాత్రి పురస్కరించుకొని కొత్త హంగులతో ముస్తాబయిందని ధర్మకర్తలు బాలారెడ్డెప్ప నాయన, బర్నేపల్లి వెంకట స్వామిలు తెలిపారు. బుధవారం ఉదయం అభిషేకాలతో ప్రారంభమై సాయంత్రం సహస్రనామ లక్ష్యబిల్వర్చన, రాత్రంతా మేళతాళాలు, చెక్కభజనలు తో అమ్మవారి కథ కాలక్షేపం, భక్తి గీతాలు తో రాత్రంతా భక్తాదులు జాగారం చేస్తారు. గురువారం ఉదయం 10 గంటలకు శ్రీ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి మూడు గంటల వరకు భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేస్తారు. కార్యక్రమాలు ఆలయ కార్యకర్తలు కె.ఆది నారాయణ, ఎస్ కరుణాకర, కుమారయ్య, నరేష్, శివ, బాలు పాల్గొంటారు.

శివాలయాలకు ప్రత్యేక ఆర్‌టిసి సర్వీసులు

మదనపల్లి అర్బన్

మహాశివరాత్రి మహాశివరాత్రిని పట్టణంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. పట్టణంలో ప్రసిద్ధి చెందిన మడికయల శివాలయం, మంజునాథ ఆలయం, సిటియం రోడ్డు, దేవలం వీధి, అనంత బంగ్లా లోని శైవక్షేత్రాలు ప్రధానమైనవి. పండుగ సందర్భంగా భక్తుల తాకిడి ఎక్కువగానున్న నేపథ్యంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. మదనపల్లి -1 డిపో పరిధిలో శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు డిపో మేనేజర్ వెంకటరమణ రెడ్డి తెలిపారు. మదనపల్లి-తంబళ్లపల్లి మల్లయ్య కొండ క్రిందికి - 20 బస్సులు, తంబళ్లపల్లి - రాగిమాను మల్లయ్యకొండ క్రిందికి 10 బస్సులు, మల్లయ్యకొండ క్రింద నుంచి మల్లయ్యకొండపైకి 35 బస్సులు, బి.కొత్తకోట- మల్లయ్యకొండ క్రిందికి-2బస్సులు, మొలకలచెరువు-మల్లయ్యకొండ క్రిందికి - 2 బస్సులు, పెద్దమండ్యం - మల్లయ్యకొండ క్రిందికి-2 బస్సులు, అంగళ్ళు - చిన్న మల్లయ్యకొండకు 10 బస్సులు చొప్పున సర్వీసులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. **పీలేరు:** పీలేరు ఆర్టీసీ డిపో నుంచి బుధ, గురువారాల్లో 35 ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాటు చేసినట్లు పీలేరు ఆర్‌టిసి డిఎం పి. నిర్మల మంగళవారం తెలిపారు. తిరుపతి జిల్లా, యర్రావారిపాలెం మండలం, తలకోన శ్రీ సిద్దేశ్వరుడి తిరుణాలకు వెళ్లే భక్తుల కోసం పీలేరు నుంచి తలకోనకు 25 బస్సులు, బోడేవాండ్లపల్లె నుంచి తలకోనకు 3, భాకరాపేట నుంచి తలకోనకు 4, బసన్నగారిపల్లె నుంచి తలకోనకు 3 బస్సులు నడుపుతున్నట్లు ఆమె చెప్పారు. 27న కలకడ నుంచి ఝరికోనకు 10 ప్రత్యేక బస్సు సర్వీసులు కూడా నడపనున్నట్లు ఆమె వివరించారు. ప్రయాణీకుల రద్దీని బట్టి అదనపు సర్వీసులు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు ఆర్‌టిసి సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

ప్రజాశక్తి-రాయచోటి టౌన్ : అవసరం ఉన్న వారి సంక్షేమం కోసం స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని అమానత్ సేవా సొసైటీ వ్యవస్థాపకుడు షేక్ అతావుల్లా అన్నారు. సోమవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో రక్తం అవసరం అవడంతో కుటుంబ సభ్యులు ఆయనకు సంప్రదించడంతో స్పందించిన ఆయన వెంటనే జవాద్ ఖాన్, మహమ్మద్ జీ షాన్ యువకుల చేత దీప బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిదానాల్లో కెల్లా రక్తదానం గొప్పదన్నారు. రక్తదానం చేసిన వారికి అభినందించారు. కార్యక్రమంలో ఈబా బ్లడ్ డోనర్స్ ఆర్గనై జేషన్ వ్యవస్థాపకుడు మాయాన మొహమ్మద్ అలీ, దీపా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది రవినాయక్, రాహుల్‌షాహుల్ పాల్గొన్నారు.

కోళ్ల ఫారం తొలగించాలని గ్రామసభలో తీర్మానం

ప్రజాశక్తి-గాలివీడు : మండల పరిధిలోని గోరాన్ చెరువు దాసరివాండ్లపల్లిలో దాసరి మధుసూదనరెడ్డి కోళ్ల ఫారం నిర్మించారు. ఆ కోళ్ల ఫారం చుట్టూ పాఠశా లలు, అంగన్వాడీ కేంద్రంఉండడం వల్ల పిల్లలు అస్వస్థకు గురి అవుతు న్నారని తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం గోరాన్ చెరువు గ్రామ సచివాలయం వద్ద గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలు పంచాయతీ కార్యదర్శి సరోజ సర్పంచ్ దాదినేని. దీప్తి ఇఒపిఆర్‌డి శ్రీనివా సులు, ఎంపిడిఒ సి.జవహర్‌బాబు వార్డు మెంబర్లు ప్రజలు సమావే శమయ్యారు. ఈ సమావేశంలో దాసరి మధుసూదన్ రెడ్డి కుటుంబ సభ్యు లు మాత్రం ఇక్కడ కోళ్ల ఫారం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆపల్లికి చెందిన ఎక్కువ మంది ప్రజలు కోళ్ల ఫారం నిర్మించడం వల్ల దుర్వాసన ఈగ లు దోమల వల్ల పిల్లలు ఎక్కువ అస్వస్థకు కోళ్ల ఫారం తొలగించాలని గ్రామసభలో తీర్మానం చేశారు.

'అన్నమాచార్య' విద్యార్థుల వినూత్న ఆవిష్కరణ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్ : అన్నమాచార్య విశ్వవిద్యాలయంలోని ఇఇఇ విభాగానికి చెందిన విద్యార్థులు జె.భూమిక, ఎన్.అనుశర్మ, పి.చరణ్, ఎస్.అహ్మద్ పర్యవేక్షకుడు డాక్టర్ కే.హరినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో వినూత్న ఆవిష్కరణగా సౌర వృక్షంను రూపొందించారు. ఈ సౌర వృక్షం 6 సోలార్ ప్యానెల్‌లతో కూడి ఉండి, ప్రతి ప్యానెల్ 50 వాట్లు, 24 వోల్ట్ రేటింగ్ కలిగి ఉంటుందని, ఇది రోజుకు సుమారు 3 యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేయగల సామర్థ్యం కలిగి ఉండి తద్వారా ఒక మధ్య తరగతి కుటుంబం రోజువారీ విద్యుత్ అవసరాలను తీర్చగలదని విద్యార్థులు తెలిపారు ఈ ప్రాజెక్టును అన్నమాచార్య విశ్వవిద్యాలయ ప్రో-చాన్సలర్ సి.అభిషేక్ రెడ్డి కళాశాలలో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఈ విధమైన ప్రాజెక్టులు విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథాన్ని పెంపొందించడంతో పాటు సమాజానికి, పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడతాయని తెలిపారు. యూనివర్సిటీ ఛాన్సలర్ చొప్ప గంగిరెడ్డి, వైస్ ఛాన్సలర్ సాయిబాబా రెడ్డి, వైస్ చైర్మన్ ఎల్లారెడ్డి, రిజిస్టార్ ఎన్.మల్లిఖార్జునరావు, ప్రిన్సిపల్ ఎస్ఎంవి నారాయణ, ఇఇఇ విభాగాధిపతి ఎం.పద్మ లలిత విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.

ఆత్మస్థైర్యంతో ఏదైనా సాధించవచ్చు : 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

శివకోటిని సన్మానిస్తున్న చమర్తి

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే ఏదైనా సాధించవచ్చునని రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు పేర్కొన్నారు. ఇటీవల నేపాల్‌లో జరిగిన వికలాంగుల అంతర్జాతీయ క్రికెట్ పోటీలలో నందలూరుకు చెందిన శివకోటి అత్యద్భుతంగా రాణించి భారత్ విజయం చేకూర్చిన సందర్భంగా మంగళవారం టిడిపి పార్లమెంటు కార్యాలయంలో శివకోటి చమర్తిని మర్యాదపూర్వకంగా కలిశారు. శివకోటిని శాలువాతో ఆయన ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చమర్తి జగన్ రాజు మాట్లాడుతూ వైకల్యం శరీరానికే తప్ప మనోధైర్యానికి కాదని శివకోటి నిరూపించారని అన్నారు. పేద కుటుంబంలో పుట్టి నేడు అంతర్జాతీయ స్థాయికి ఎదిగి దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న శివకోటి నేటి యువతకు ఆదర్శనీయమని కొనియాడారు. అతి దగ్గరలో శ్రీలంకతో జరగనున్న అంతర్జాతీయ క్రికెట్ మ్యాచ్ లోనూ శివకోటి రాణించి భారత్ ను విజయతీరాలకు చేర్చాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గన్నేసుబ్బ నరసయ్య నాయుడు, ఉపాధ్యక్షులు ఆర్.సతీష్ రాజు, అజయ్ కుమార్ నాయుడుపాల్గొన్నారు.

శిక్షణ సర్టిఫికేషన్ పొందాలి

ప్రజాశక్తి - రాయచోటి

ప్రతి ఒక్క ఆహార వ్యాపారి పాస్ట్రాక్ శిక్షణ సర్టిఫికెట్‌ను పొందాలని పాస్ట్రాక్ ఫుడ్ సేఫ్టీ ట్రైనర్ పాలకొలను యశోదాదేవి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని డైట్ కళాశాలలో జాతీయ ఆహార భద్రతా సంస్థ ఆమోదించిన ఎఫ్ఎస్ ఎస్ యాక్ట్ 2006, 2017 అక్టోబర్ సిక్త్ ఇన్ టర్మ్స్ ఆఫ్ సెక్షన్ 16(3),2011లైసెన్సింగ్, రిజిస్ట్రేషన్ ఫుడ్ బిజినెస్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ షెడ్యూల్ 4 ప్రకారంగా వ్యాపారులకు ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కడప-అన్నమయ్య జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ డాక్టర్ షమీం బాషా మాట్లాడుతూ పాస్ట్రాక్ కార్యక్రమం ద్వారా ప్రతి వ్యాపారస్తుడు ఆహార భద్రత, నాణ్యత, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు. పరిశుభ్రమైన ఆహారాన్ని తయారు చేయాలన్నారు. ఆహారంలో చోటుచేసుకునే కల్తీని గుర్తించాలని, ఫుడ్ కలర్స్, అజ్నో మోటో టేస్టీ సాల్ట్‌ను వాడకూడదని చెప్పారు. . కెవిజివిఎం సౌత్ ఇండియా ఫుడ్ సేఫ్టీ ట్రైనింగ్ ఇన్‌ఛార్జులు టి. సింధు, మోహన్ బాబు మాట్లాడుతూ రాయచోటి జిల్లాలోని ఆహార సంబంధ వ్యాపార యజమానులు అందరూ శిక్షణకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా టీంహెడ్ పూజారి రెడ్డిశేఖర్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత రాష్ట్రాన్ని నిర్మిద్దాం

ప్రజాశక్తి-మదనపల్లె

డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దామని ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ రామ లింగారెడ్డి అన్నారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హ్యుమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగఅదిపతి డాక్టర్ టి,అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలై మంచి భవిష్యత్తుని కోల్పోతున్నారని అన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకి దూరంగా ఉండా లని ప్రతిజ్ఞ చేయించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి వై.అరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజంలో కీలక పాత్ర పోషించాలని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా గురించి తెలిసినప్పుడు పోలీసులకు సమా చారం ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ కె సతీష్‌బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భిక్షాటనకు వచ్చి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి-కలకడ : భిక్షాటనకు వచ్చి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది.మండలంలోని బాలయ్యగారిపల్లి పంచాయతీ ఎర్రయ్యగారిపల్లెలో ఉన్న స్థానిక ప్రయివేట్ పెట్రోల్ బంక్ వద్ద వృద్యుడు మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి వచ్చి పరిశీలించి అతని వద్ద ఉన్న ఆధార్ కార్డు ద్వారా మృతుడి చిరునామా తెలుసుకున్నట్టు చెప్పారు. పాకాల మండలం పాకాలకు చెందిన నాగభూషణం అనే వృద్ధుడు గత మూడు నెలల క్రితం భిక్షాటనకు వచ్చి ఇక్కడే తిరుగుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. ఎస్ఐ రామాంజనేయులు తన సిబ్బంది రమేష్‌ను అక్కడే ఉంచి మృతుడి కుమారుడి అడ్రస్ తెలుసుకుని విషయం తెలిపినట్లు తెలిపారు. మృతుడి కుమారుడు తన తండ్రి మృతదేహాన్ని తీసుకెళ్లినట్లు కానిస్టేబుల్ రమేష్ తెలిపారు.

23న రాయలసీమ మాలల సింహగర్జన సభ

ప్రజాశక్తి-బి.కొత్తకోట : మార్చి 23వ తేదిన తిరుపతిలో మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని రాయలసీమ మాలమహానాడు అధ్యక్షుడు డాక్టర్ యమలా సుదర్శనం పిలుపునిచ్చారు. మంగళవారం బి.కొత్తకోట పట్టణం, జ్యోతి చౌక్, అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యమలా సుదర్శనం మాట్లాడుతూ మాలల హక్కుల సాధనే లక్ష్యంగా ఈ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎస్‌సి వర్గీకరణ బిల్లుపై కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పునరాలోచించాలని అన్నారు. నియోజకవర్గంలోని మాలలు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాలమహానాడు దార్ల నరసింహులు,సంకు హరికృష్ణ,గుండా మనోహర్, మల్లెల మోహన్, విశ్వ నాథ్, రామచంద్ర, నరసింహులు, శంకర, రమేష్, శ్రీరాములు పాల్గొన్నారు.

క్రైస్తవుల పక్షపాతి సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : ముఖ్యమంత్రి చంద్రబాబు క్రైస్తవుల పక్షపాతి అని టిడిపి క్రిస్టియన్ సెల్ నాయకులు బోనాసి జాన్‌బాబు పేర్కొన్నారు. మంగవారం పట్ట ణంలో ఎస్‌బిఐ కాలనీ లోని పీటర్ రాక్ మెమోరియల్ చర్చిలో గ్లోరీ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జాన్‌బాబు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం క్రిస్టియన్ల సంక్షేమానికి పెద్ద పీట వేస్తోందన్నారు. క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషనుకు రూ.486 కోట్లు మంజూరు చేయడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఇందుకుగాను సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్, స్థానిక ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషాకు గ్లోరీ పాస్టర్స్ అసోసియేషన్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. కార్యక్రమంలో పాస్టర్ దేవమణి, కమిటీ సభ్యులు పాస్టర్లు దివాకర్, ఎం.జీవరత్నం, అసోసియేషన్ సెక్రటరీ పా స్టర్ బయ్యారెడ్డి, బ్రదర్ జీవరాజు, బ్రదర్‌బాబు, అలీసమ్మ, కృపమ్మ, శాంతమ్మ పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి-బి.కొత్తకోట :చిల్లర అంగడిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు బి.కొత్తకోట సిఐ జీవన్ గంగానాథ్‌బాబు తెలిపారు.మండలంలోనిగుమ్మసముద్రం పంచాయితీ, కొండకిందపల్లి దగ్గర ఉన్న చిల్లర అంగడి యజమాని బొల్లం నాగిరెడ్డి కుమారుడు బొల్లం రామచంద్రారెడ్డి అనే వ్యక్తి గట్టు బ్రాందీషాప్ నుంచి మద్యం తెప్పించుకుని తన చిల్లర దుకాణంలో అధిక ధరలకు అమ్ముతున్నట్లు సమాచారం అందిందన్నారు. మంగళవారం తనిఖీ చేసి అతని వద్ద ఉన్న 7 మద్యం బాటిల్స్ వాటి విలువ సుమారుగా 1,400 రూపాయలు స్వాధీనం చేసుకోవడం జరిగిందన్నారు. మద్యం బాటళ్లను స్వాధీనం చేసుకుని రామచంద్రారెడ్డి, గట్టు బ్రాందీ షాప్ యజమాని రాజన్నపై కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

కష్టపడి కాదు ఇష్టపడి చదవాలి : ఎంఇఒ

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని ఎస్‌బివిడి సభ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కరస్పాండెంట్ శ్రీరాములు, ఎంఇఒలు చక్రధర్‌రాజు, నాగతిరుమలరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలని కష్టపడి చదువుకూడదని తెలిపారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిస్తే ఉన్నత లక్ష్యాలు చేరుకుం టారని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు సెల్ ఫోన్ లకు, టీవీలకు, వ్యసనాలకు దూరంగా ఉండేటట్లు తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని పేర్కొన్నారు. వీడ్కోలు సమావేశానికి నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్ర మంలో ప్రిన్సిపల్ అద్దేపల్లి బాలాజీ రాజు, అధ్యాప కులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నూతన భవన నిర్మాణానికి కృషి చేయండి

ప్రజాశక్తి-నందలూరు

మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ ఆర్‌ఎస్‌రోడ్డులో బ్రిటిష్ కాలంలో నిర్మించబడిన బంగ్లా నేడు శిథిలావస్థితికి చేరిందని, దాని స్థానంలో నూతన భవన నిర్మాణానికి కృషి చేయాలని ఆర్‌అండ్‌బి ఇఇ సహదేవరెడ్డికి మంగళవారం వినతి పత్రం అంద చేసినట్లు ఐకెపిఎస్ నాయకులు పోతురాజు మస్తానయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగ్లా శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిందని అన్నారు. ఈ భవనంం అన్యాక్రాంతం కాకుండా నూతన భవనం, ప్రహరీ నిర్మించాలని కోరారు. ఈ ఈ ని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో హిమగిరినాథ్‌యాదవ్, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

పకడ్బందీగా బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

అత్తిరాల శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి బ్రహోత్సవాలు ఏర్పాట్లు కట్టుదిట్టంగా ఉండాలని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్‌రాజు అధికారులను ఆదేశించారు. మంగళవార బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పెరిగిన ఉష్ణోగ్ర తల కారణంగా భక్తులు ఇబ్బందులకు గురికాకుండా చలువ పందిళ్లు, మంచినీ టి సౌకర్యం ఏర్పాటు చేయాలని సూచించారు. బహుద నదిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని అన్నారు. కార్యక్రమంలో గన్నేసుబ్బనర్సయ్యనాయుడు, సుబ్రహ్మణ్యం నాయుడు పాల్గొన్నారు.

అమెరికా యూనివర్సిటీతో 'మిట్స్' ఒప్పందం

ప్రజాశక్తి-మదనపల్లె

మదనపల్లె సమీపంలోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల యునైటెడ్ స్టేట్ ఆఫ్ అమెరికాలోని బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూని వర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ప్రపంచ విద్యా ప్రయాణంలో ఒక ముఖ్యమైన మైలురాయని, కళాశాలకు బౌలింగ్ గ్రీన్ స్టేట్ యూనివర్సిటీ నుంచి వచ్చిన ప్రతినిధల బృందం డాక్టర్ రామ్‌వీరపనేని, తాత్కాలిక వైస్ ప్రోవోస్ట్ ఫర్ అకడమిక్ అఫైర్స్, డాక్టర్ వేల్ మొఖ్తార్, డీన్, కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, ఆర్కిటెక్చర్ అండ్ అప్లైడ్ ఇంజనీరింగ్, మిస్టర్ కాన్ (జాన్) ఎర్డోగ్మస్, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్, పార్ట్‌నర్‌షిప్స్, ఇంటర్నే షనల్ స్టూడెంట్ రిక్రూటర్ సలహాదారు పాల్గొన్నారన్నారు. విద్యా ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి, ఉమ్మడి పరిశోధన ప్రాజెక్టులు, క్రాస్-కల్చరల్ లెర్నింగ్ కోసం విద్యార్థి, అధ్యాపకుల మార్పిడి కార్యక్రమాలు, ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా పాఠ్యాంశ అభి వృద్ధి ఈ అవగాహన ఒప్పందం ముఖ్య ఉదేశ్యమని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, అడ్వైజర్ ఆర్‌అండ్‌డి డాక్టర్ తులసీరామ్ నాయుడు, సీనియర్ మేనేజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.